సాక్షి
వరంగల్
శనివారం । 18 । అక్టోబర్ । 2025



రేస్‌వాక్‌లో రికార్డు బ్రేక్..
హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరుగుతున్న జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలు రెండోరోజు కొనసాగాయి.
- IIలో▸



ఏసీబీ వలలో అవినీతి చేపలు
వరంగల్ జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో అవినీతి అధికారులను ఏసీబీ అధికారులు శుక్రవారం పట్టుకున్నారు.
- IIలో▸

గరిష్ఠం/కనిష్ఠం
$26^0/23^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం వేళ సాధారణంగా ఉంటుంది. రాత్రి ఆహ్లాదకరంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా నిర్వహించాలి

న్యూశాయంపేట: జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను జిల్లా అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి ఆదేశించారు. వరంగల్ డివిజన్‌లో ధాన్యం కొనుగోలుపై సన్నాహక, శిక్షణా కార్యక్రమాన్ని హనుమకొండ డీసీసీబీ భవన్ ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ వానాకాలం 2025 -26కు సంబంధించి ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పక్కాగా చేపట్టాలన్నారు. కేంద్రాలను లోతట్టు ప్రాంతాల్లో ఏర్పాటు చేయొద్దని, కనీస వసతులు కల్పించాలని పేర్కొన్నారు. అవసరమైన గన్నీ సంచులు, టార్పలిన్లు, తేమ శాతాన్ని నిర్ధారించే యంత్రాలను సమకూర్చనున్నట్లు చెప్పారు. ఈ క్రమంలో అధికారులు, నిర్వాహకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి అనురాధ, జిల్లా పౌరసరఫరాల అధికారి కిష్టయ్య, జిల్లా మేనేజర్ సంధ్యారాణి, అధికారులు పాల్గొన్నారు.

పశుసంపదను కాపాడుకోవాలి



రాయపర్తి: పశువులు రోగాలబారిన పడకుండా కాపాడుకుంటూ పశుసంపదను పెంచుకోవాలని రైతులకు వరంగల్ జిల్లా డీవీహెచ్ఓ డాక్టర్ బాలకృష్ణ సూచించారు. మండలంలోని మైలారం గ్రామంలో పశువులకు గాలికుంటు టీకాల కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల బారినుంచి పశువులను కాపాడుకునేందుకు ప్రభుత్వం కల్పించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ శ్రుతి, మక్బుల్, జేవీఓ వెంకటయ్య, ఎల్ఎస్ఏ గణేష్, వీఏ.కపిల్, గోపాల మిత్రలు రమేష్, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఆర్డీఎఫ్ విద్యార్థిని



పర్వతగిరి: వరంగల్ జిల్లా పరిధిలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అండర్ -19 బాలికల వాలీబాల్ ఎంపికలో మండలంలోని కల్లెడ ఆర్డీఎఫ్ వనితా అచ్యుతా పాయి విద్యాలయ జూనియర్ కళాశాల విద్యార్థిని జి.వెన్నెల రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన పోటీల్లో జి.మహేశ్వరి, జి.కళ్యాణి, జి.వెన్నెల, ఎం.శిరీష, యశస్విని, ఎం.అమృత, పి.సౌమ్య పాల్గొనగా జి.వెన్నెల అద్భుత ప్రతిభ కనబర్చి మూడో స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా ఆ విద్యార్థిని కళాశాల ప్రిన్సిపాల్ ఆడెపు జనార్దన్, ఉపాధ్యాయులు అభినందించారు. అకడమిక్ హెడ్ ప్రవీణ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ రాజు, ఏఓ సతీష్, అధ్యాపకులు మహేశ్వర్, జయశంకర్, సంతోష్‌కుమార్, శ్రీధర్, ధన్య, పీటీ కోకిల, సైదులు, గుంశావళి, తిరుమల, ధనలక్ష్మి పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం



నెక్కొండ: విద్యతోపాటు ఆత్మరక్షణ కోసం కరాటేలోనూ విద్యార్థినులు రాణించాలని టీజీ రెసిడెన్సియల్ స్కూల్, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి సూచించారు. కరాటేలో ప్రతిభ చాటిన వారిని పాఠశాలలో గురువారం అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 16న ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి 69వ ఎస్‌జీఎఫ్ కరాటే పోటీలు ములుగు జిల్లాలో జరగగా, తమ విద్యార్థులు 16 మంది వివిధ విభాగాల్లో పాల్గొన్నారని తెలిపారు. కరాటే అండర్ -17లో విభాగంలో టి.శ్రీలక్ష్మి ప్రథమ స్థానంలో నిలవగా, మరో ఏడుగురు విద్యార్థులు ద్వితీయ, ఇంకో ఐదుగురు విద్యార్థులు తృతీయ స్థానాల్లో నిలిచారని ప్రిన్సిపాల్ వివరించారు. కార్యక్రమంలో పీఈటీ కమల కుమారి, కరాటే మాస్టర్ రాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆశన్నను ఎప్పుడూ చూడలేదు..

వెంకటాపురం(ఎం): మావోయిస్టు పార్టీ అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు తక్కెళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్నను తామెప్పుడూ చూడలేదని నర్సింగాపూర్ గ్రామస్తులు పేర్కొన్నారు. ఆశన్న లొంగిపోయిన విషయం టీవీల్లో మాత్రమే చూశామని వారు తెలిపారు. హనుమకొండలోని గోపాలపూర్‌లో నివాసముంటున్న ఆశన్న సోదరుడు సహదేవరావు దగ్గర తల్లి సరోజన ఉంటుందని పేర్కొన్నారు. ఆశన్న అజ్ఞాతంలోకి వెళ్లిన విషయం తమకు తెలియదని, జనజీవన స్రవంతిలో కలవడం సంతోషంగా ఉందని వివరించారు.



ఆశన్న స్వగ్రామం నర్సింగాపూర్

అడవి విడిచి జనంలోకి

ఛత్తీస్‌గఢ్‌లో లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేత వాసుదేవరావు


లొంగిపోయే ముందు ఆశన్న

- 25 ఏళ్ల వయసులో అజ్ఞాతంలోకి.. నాలుగున్నర దశాబ్దాలు అడవిలో..
- దళసభ్యుడి నుంచి కేంద్ర కమిటీ వరకు ఆశన్న ఉద్యమ ప్రస్థానం

సాక్షిప్రతినిధి, వరంగల్: దండకారణ్యంలో మావోయిస్టుల లొంగుబాటు కొనసాగుతోంది. బుధవారం ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మల్లోజుల వేణుగోపాలరావు అలియాస్ అభయ్ మహారాష్ట్రలోని గడ్చిరోలిలో ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఎదుట 61 మంది సహచరులతో ఆయుధాలతో లొంగిపోయిన విషయం తెలిసిందే. తాజాగా మావోయిస్టు పార్టీ మరో కేంద్ర కమిటీ సభ్యుడు, డీకేఎస్‌జెడ్సీ ప్రతినిధి తక్కెళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న అలియాస్ రూపేశ్ శుక్రవారం అనుచరులతో అడవిబాటను వదిలారు. 208 మంది(110మంది మహిళలు, 98మంది పురుషులు)తో కలిసి 153 ఆయుధాలతో ఆయన జగ్దల్‌పూర్‌లో ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయ్, పోలీసు ఉన్నతాధికారుల ఎదుట లొంగిపోయారు. ప్రధానంగా దంతెవాడ, నారాయణపూర్ జిల్లాల సరిహద్దులో ఉన్న ఇంద్రావతి ఏరియాను కేంద్రంగా ఏర్పాటు చేసుకుని ఆశన్న కార్యక్రమాలు కొనసాగించారు. ఛత్తీస్‌గఢ్‌లోని వివిధ ప్రాంతాల్లో భారీగా మావోయిస్టులు లొంగిపోయినట్లు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా 'ఎక్స్' వేదికగా ప్రకటించారు.

చర్చల కోసం ప్రయత్నించి..

ఆపరేషన్ కగార్ ఉధృతం కావడం.. చాలామంది మావోయిస్టులు ఎన్‌కౌంటర్లలో మృతి చెందారు. ఈనేపథ్యంలో చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని


ఆశన్న కుటుంబం నివసించిన స్థలం

కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరిట మార్చి 28న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖలు రాశారు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఒక దశలో ఒకే అన్నప్పటికీ.. తర్వాత జరిగిన పరిణామాల్లో భాగంగా నో చెప్పారు. ఆ తర్వాత మే నెలలో కేంద్ర కమిటీ సభ్యుడు తక్కెళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న చర్చలను ప్రతిపాదిస్తూ ఛత్తీస్‌గఢ్‌లోని ఓ మీడియా చానల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రజలు, ప్రజా సంఘాలు చొరవ చూపాలని ఆయన కోరారు. అయినప్పటికీ దండకారణ్యంలో పోలీస్ కూంబింగ్ కొనసాగి కేంద్ర కమిటీ కార్యదర్శి నంబళ్ల కేశవరావు అలియాస్ బస్వరాజ్ సహా పలువురు అగ్రనాయకులు, కేడర్ ఎన్‌కౌంటర్లలో మృతి చెందారు. ఇక చర్చల ప్రతిపాదనలతో ఫలితం లేదనే భావనతోపాటు పలు కారణాలతో లొంగుబాటును ఎంచుకున్న కేంద్ర కమిటీ నాయకులు మల్లోజుల వేణుగోపాల్, తక్కెళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ రూపేశ్ సహచరులు, ఆయుధాలతో సరెండర్ అయ్యారు.

తక్కెళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్నది ములుగు జిల్లా వెంకటాపురం(ఎం) మండలం లక్ష్మీదేవిపేట శివారు పోలోనిపల్లి (నర్సింగాపూర్) స్వగ్రామం. తల్లి సరోజన, తండ్రి భిక్షపతిరావు, తమ్ముడు సహదేవరావు, అక్క సొమ్మ. తండ్రి భిక్షపతిరావు 2012లో గొంతు కేన్సర్‌తో మృతిచెందగా, తమ్ముడు సహదేవరావు రైల్వేశాఖలో డ్రైవర్‌గా పనిచేస్తూ హనుమకొండలోని గోపాల్‌పూర్‌లో

ఆర్ఎస్‌యూ నుంచి అజ్ఞాతంలోకి..

స్థిరపడినట్లు బంధువులు తెలిపారు. కాగా, వాసుదేవరావు ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు లక్ష్మీదేవిపేట ప్రభుత్వ పాఠశాలలో చదివారు. అనంతరం కాజీపేటలోని సెయింట్‌గ్యాబ్రియల్ స్కూల్‌లో సెకండరీ విద్యనభ్యసించారు. భువనగిరిలో ఐటీఐ కూడా చేసిన ఆయన, కాకతీయ వర్సిటీలో డిగ్రీ చదువుతూ.. రాడికల్ స్టూడెంట్ యూనియన్‌కు (ఆర్ఎస్‌యూ) నాయకత్వం వహించారు. ఆతర్వాత పరిణామాల నేపథ్యంలో 25 ఏళ్ల వయసులో అజ్ఞాతంలోకి వెళ్లారు. 1991 నుంచి ఆర్ఎస్‌యూలో పనిచేసి అజ్ఞాతంలోకి వెళ్లాక దళ సభ్యుడి నుంచి నాలుగున్నర దశాబ్దాల్లో కేంద్ర కమిటీ అగ్రనేత వరకు ఎదిగారు.

మావోయిస్టు నేత తాతతో కలిసి పనిచేసిన ఆశన్న 1993-94లో అన్నసాగర్ ఏరియా డిప్యూటీ కమాండర్‌గా, కమాండర్‌గా పనిచేశారు. శేషగిరిరావు అలియాస్ గోపన్నతో కలిసి పనిచేసిన ఆయన నల్లగొండ జిల్లాలోనూ కొంతకాలం దళనేతగా ఉన్నారు. ఆతర్వాత అనతి కాలంలోనే 1999లో పీపుల్స్‌వార్ పార్టీ నాయకత్వం యాక్షన్ టీంకు ఇన్‌చార్జ్‌గా నియమించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పలు కీలక యాక్షన్లకు ఆశన్న నాయకత్వం వహించినట్లు పోలీసు రికార్డులు నమోదయ్యాయి.

కీలక దాడులకు వ్యూహకర్త ఆశన్న..

2000 సంవత్సరంలో అప్పటి హోం మంత్రి మాధవరెడ్డి కారును పేల్చి చంపిన ఘటనలో కీలకమని అప్పట్లోనే పోలీసులు ప్రకటించారు. 2003లో అలిపిరిలో చంద్రబాబు కాన్వాయ్‌ని క్లైమోర్‌మైన్ పేల్చిన ఘటనతోపాటు హైదరాబాద్ సంజీవరెడ్డినగర్‌లో ఐపీఎస్ అధికారి ఉమేశ్ చంద్రను పట్టపగలే కాల్చిచంపిన ఘటనకు ఈయనే నాయకత్వం వహించినట్లు రికార్డులున్నాయి. ఆ తర్వాత నిర్బంధం పెరగడంతోపాటు ఉద్యమ నిర్మాణంలో భాగంగా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు, దండకారణ్యంలో వివిధ కేడర్లలో పనిచేసిన ఆశన్న కేంద్ర మిలటరీ కమిషన్‌కు కూడా కొంత కాలం ఇన్‌చార్జ్‌గా పనిచేసినట్లు ప్రచారం ఉంది. కాగా, దళ సభ్యుడి నుంచి కేంద్ర కమిటీ నేత వరకు ఎదిగి.. ఛత్తీస్‌గఢ్, సౌత్ బస్తర్, మాడ్ డివిజన్లలో కీలకంగా వ్యవహరించిన ఆయన శుక్రవారం ఉద్యమ సహచరులతో కలిసి లొంగిపోవడం చర్చనీయాంశంగా మారింది.

గ్రామస్తులం సంతోషిస్తున్నాం..



ఆశన్న అజ్ఞాతంలోకి వెళ్లిన విషయం మాకు తెలియదు. ఆశన్న తండ్రి భిక్షపతిరావు ఆ కాలంలోనే హనుమాన్ గుడి నిర్మాణానికి గుంట భూమిని విరాళంగా ఇచ్చాడు. వాసుదేవరావు మావోయిస్టు పార్టీలో పనిచేసి జనజీవన స్రవంతిలో కలిసినందుకు గ్రామస్తులం సంతోషిస్తున్నాం. వాసుదేవరావును చూడాలని ఉంది. స్వగ్రామానికి వస్తే స్వాగతం పలుకుతాం.

- గొర్రె రాజయ్య, నర్సింగాపూర్

చిన్నప్పుడే అన్నల్లోకి పోయిండు..



భిక్షపతిరావుకు ఇద్దరు కొడుకులు, ఒక బిడ్డ. అందులో వాసుదేవరావు పెద్దోడు, సహదేవరావు చిన్నోడు, సొమ్మ ఇద్దరి కంటే పెద్దది. చిన్నప్పుడే వాసుదేవరావు అన్నల్లోకి పోయిండని తెలుసు. అప్పటి నుంచి ఎప్పుడు చూడలేదు. భిక్షపతిరావు చనిపోయాక వాళ్లు ఇక్కడ ఉండడం లేదు. ఇక్కడ పుట్టిన వాసుదేవరావు అన్నల్లో నుంచి బయటకు వచ్చిండని తెలిసింది.

- గాజవేన ఓదెలు, నర్సింగాపూర్

ఎయిర్‌పోర్ట్‌తో పారిశ్రామికాభివృద్ధి


సమావేశంలో కలెక్టర్, అధికారులు

న్యూశాయంపేట: వరంగల్‌లో ఎయిర్‌పోర్ట్ నిర్మాణం అనేది ప్రజల ఆకాంక్ష అని, హైదరాబాద్ తర్వాత రెండో రాజధానిగా పేర్కొంటున్న వరంగల్‌ను పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు మామునూరు ఎయిర్‌పోర్ట్ ఎంతో ఉపయోగపడుతుందని కలెక్టర్ డాక్టర్ సత్యశారద అన్నారు. ఎయిర్‌పోర్ట్ భూసేకరణ పనుల పురోగతిపై ల్యాండ్ అక్విజేషన్ రిటైర్డ్ ఓఎస్డీ మనోహర్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఎయిర్‌పోర్ట్ మేనేజర్ తులసి మహాలక్ష్మి, లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులతో కలెక్టరేట్‌లో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మామునూరు ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుకు 220 ఎకరాల వ్యవసాయ భూమి సేకరణకు ప్రభుత్వం ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేసిందని అన్నారు. ఎయిర్‌పోర్ట్ స్థలంలోని చెరువులు కుంటలు, విద్యుత్ హైపోల్స్, సెల్‌టవర్లు, ఎత్తుగా ఉన్న భవనాలు, చెట్లను గుర్తించి నివేదికలు అందజేయాలని సంబంధిత అధికారులను సత్యశారద ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో, వరంగల్ ఇన్‌చార్జ్ ఆర్డీఓ విజయలక్ష్మి, ఖిలా వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్, ఆర్డీఓ కార్యాలయ డీఏఓ ఫణికుమార్, ఎస్ఈ ఇరిగేషన్ వరంగల్ హెచ్‌వీ.రాంప్రసాద్, మిషన్ భగీరథ డీఈ జీవన్, ఎన్పీడీసీఎల్ ఏడీఈ చంద్రమౌళి, లీగల్ మెట్రాలజీ శ్రీనివాస్‌రావు, డీఏఓ సృజనకుమారి, సర్వేయర్ రజిత, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి

ఖానాపురం: విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ సత్యశారద సూచించారు. మండలంలోని అశోక్‌నగర్ కేజీబీవీని శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్ పరిసరాలు, తరగతి గదులు, భవనాలు, స్టోర్ రూం, వంటగది, కూరగాయల నాణ్యత, మధ్యాహ్న భోజనం, అభివృద్ధి పనులను పరిశీలించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఫిర్యాదుల పెట్టెను తెరిచి పరిశీలించారు. ప్రిన్సిపాల్ మేనకపై అనేక ఫిర్యాదులు రావడంతో ఆమెను కలెక్టర్ మందలించారు. భవనంపై నిరుపయోగంగా ఉన్న బెంచీలను ఇతర పాఠశాలలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని ఉపాధ్యాయులకు చెప్పారు. వారిని ప్రత్యేక ప్రణాళికతో పరీక్షలకు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో జీఈసీఓ ఫ్లోరెన్స్, తహసీల్దార్ రమేష్, టీఈడబ్ల్యూఐడీసీ డీఈ అశోక్, ఎంఈఓ శ్రీదేవి, ఎస్ఓ మేనక పాల్గొన్నారు.

ఎంఈఓపై విచారణకు ఆదేశం

మండల విద్యాశాఖ అధికారి శ్రీదేవిపై విచారణకు కలెక్టర్ సత్యశారద ఆదేశించారు. మండలంలో ఉపాధ్యాయుల డిప్యూటేషన్లు, ఉత్తమ ఉపాధ్యాయ ఎంపికలో అవకతవకలు జరిగాయని పలువురు పత్రికా విలేకరులు.. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దాంతో ఎంఈఓపై విచారణ చేసి నివేదిక అందించాలని జీఈసీఓ ఫ్లోరెన్స్‌ను ఆదేశించారు.

మత్స్యశాఖకు దిక్కెవరు?

- ఏడాదిన్నర క్రితం హనుమకొండ డీఎఫ్ఓ బదిలీ
- ఇన్‌చార్జ్ డీఎఫ్ఓగా నాగమణి
- ఏసీబీకి చిక్కడంతో రెండు జిల్లాలు ఖాళీ


ఏసీబీకి పట్టుబడిన ఫీల్డ్ ఆఫీసర్ హరీశ్ (ఉత్తమ ఉద్యోగిగా అవార్డు అందుకుంటున్నప్పటి ఫొటో)

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ, వరంగల్ జిల్లాల మత్స్యశాఖ కార్యాలయాలకు పెద్ద దిక్కు కరువైంది. సుమారు ఏడాదిన్నర క్రితం హనుమకొండ డీఎఫ్ఓ డాక్టర్ విజయభారతి బదిలీ కావడంతో ఆ సీటు ఖాళీ అయిపోయింది. వరంగల్ డీఎఫ్ఓ నరేశ్‌నాయుడు బదిలీ కాగా, ఆయన స్థానంలో నాగమణి బాధ్యతలు చేపట్టారు. కాగా, హనుమకొండ ఖాళీగా ఉండడంతో మత్స్యశాఖ ఉన్నతాధికారులు నాగమణికి ఇన్‌చార్జ్ డీఎఫ్ఓ బాధ్యతలను అప్పగించారు. ఏడాదిన్నరగా రెండు జిల్లాల అధికారిగా కొనసాగుతున్న నాగమణి తాజాగా ఏసీబీ కేసులో అరెస్ట్ కావడంతో రెండు జిల్లాలకు అధికారులు లేకుండా పోయారు.

ఉచిత చేప పిల్లల పంపిణీ ఎలా?

ఏటా ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఉచిత చేప పిల్లల పంపిణీ ఇప్పటికే ఆలస్యమైంది. గత నెల వరంగల్, హనుమకొండ జిల్లాలకు టెండర్లను ఆహ్వానించగా, బిడ్లు కూడా ఖరారైనట్లు ఇటీవల నాగమణి వెల్లడించారు. ఇప్పుడు ఆమె అవినీతి ఆరోపణలతో అరెస్ట్ కావడంతో చేప పిల్లల పంపిణీపై ప్రభావం పడే అవకాశాలున్నాయని పలువురు మత్స్య సహకార సొసైటీలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి.

ఉత్తమ ఉద్యోగి అవార్డు అందుకున్న హరీశ్

వరంగల్ ఫిషరీస్ ఫీల్డ్ ఆఫీసర్ హరీశ్ ఈఏడాది ఆగస్టు 15న వరంగల్ కలెక్టర్ సత్యశారద, మేయర్ సుధారాణి చేతుల మీదుగా ఉత్తమ ఉద్యోగిగా అవార్డు అందుకున్నారు. ఆ ఉత్తమ ఉద్యోగి శుక్రవారం లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. డీఎఫ్ఓ నాగమణి, ఫీల్డ్ ఆఫీసర్ హరీశ్ ఏడాదిన్నరగా అవకాశం ఉన్న ప్రతీ అంశంలో అవినీతికి పాల్పడుతున్నారని మత్స్యశాఖ ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. లంచాల కోసం ప్రతి ఒక్కరినీ పీడించే వారని బాహాటంగానే మాట్లాడుకోవడం వినిపించింది.

భవన మరమ్మతు పనులను పూర్తిచేయాలి

- డీఈఓ రంగయ్య నాయుడు


పిల్లలతో మాట్లాడుతున్న డీఈఓ

కాశీబుగ్గ సెంటర్: వరంగల్ ఎల్బీ నగర్‌లోని భవిత సెంటర్‌ను భవిత జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ కట్ల శ్రీనివాస్‌తో కలిసి డీఈఓ రంగయ్య నాయుడు శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మౌలాలి ప్రాథమిక పాఠశాలలోని భవిత సెంటర్‌లో జరుగుతున్న భవన మరమ్మతు పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లల (సీడబ్ల్యూఎస్ఎన్)తో కొద్దిసేపు మాట్లాడారు. మౌలాలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మాసూమ్ అలీ పాఠశాల ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్, ఉపాధ్యాయుల సెలవు పత్రాలు, విద్యార్థుల పురోగతి, తల్లిదండ్రుల సమావేశాలు వంటి అంశాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం జయబాల రెడ్డి, ప్రాథమిక పాఠశాల మౌలాలి హెచ్‌ఎం జోసెఫ్, భవిత సెంటర్ సమ్మిళిత విద్యా ఉపాధ్యాయులు స్వాతి పాల్గొన్నారు.

ప్రజల గొంతుకపై ఆంక్షలు సరికాదు

పత్రికా స్వేచ్ఛపై విషం చిమ్ముతున్న ఏపీ ప్రభుత్వం

- 'సాక్షి' మీడియా, ఎడిటర్‌పై పెట్టిన కేసులు ఎత్తివేయాలి
- జర్నలిస్టులు, ప్రజాసంఘాల నాయకుల డిమాండ్
- వరంగల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా



'సాక్షి' మీడియాపై ఏపీ ప్రభుత్వ వైఖరికి నిరసనగా వరంగల్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న జర్నలిస్టు, ప్రజాసంఘాల నాయకులు, జర్నలిస్టులు

వరంగల్/న్యూశాయంపేట: ప్రభుత్వాలు, ప్రజలకు వారధిగా ఉన్న పత్రికలపై ఆంక్షలు విధించడం సరికాదని పలువురు ప్రజా సంఘాల నాయకులు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం 'సాక్షి' మీడియాపై అనుసరిస్తున్న వైఖరి, 'సాక్షి' ఎడిటర్ ధనంజయరెడ్డితోపాటు పలువురు పాత్రికేయులపై అక్రమంగా కేసులు పెట్టి వేధించడాన్ని నిరసిస్తూ శుక్రవారం వరంగల్ కలెక్టరేట్ ఎదుట జర్నలిస్టు సంఘాలు, ప్రజాసంఘాల నాయకులు ధర్నా చేశారు. ఈసందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రజలకు సంబంధించిన విషయాలపై కథనాలు రాసినా, ప్రచురించినా ప్రభుత్వానికి అభ్యంతరాలు ఉంటే వివరణ కోరాలే తప్ప కేసులు పెట్టి బెదిరింపులకు పాల్పడడం పత్రికా స్వేచ్ఛను హరించడమే అన్నారు. వరంగల్ 'సాక్షి' బ్యూరో ఇన్‌చార్జ్ గడ్డం రాజిరెడ్డి మాట్లాడుతూ పత్రికా స్వేచ్ఛను ఏపీ ప్రభుత్వం హరిస్తోందని, 'సాక్షి' చీఫ్ ఎడిటర్ ధనంజయరెడ్డిపై పెట్టిన కేసులను బేషరతుగా ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. 'సాక్షి' మీడియాపై అనుసరిస్తున్న దమననీతికి వ్యతిరేకంగా ప్రజా, ఉద్యోగ సంఘాలతో ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో వరంగల్ స్టాఫ్ రిపోర్టర్ వాంకె శ్రీనివాస్, జర్నలిస్టు సంఘాల నాయకులు నల్లాల బుచ్చిరెడ్డి, పొడిశెట్టి విష్ణువర్ధన్, కంకణాల సంతోష్, సాయిరాం, బొల్ల అమర్, అలువాల సదాశివుడు, కొల్ల కృష్ణకుమార్, అహ్మద్, రాధాకృష్ణ, డి.రమేష్, జి.రమేశ్, ఎ.నరేందర్, వెంకట్, జాఫర్, నరేశ్, సునేందర్, వీరస్వామి, రవి, అనిల్, సబ్ ఎడిటర్లు ఓంకార్, ఉమామహేశ్, బండి రాజు, రాంచందర్, డి.రాజు, అశోక్, సాజిద్, దాసరి బాబు, సంపెట శ్రవణ్, శివ, సంపెట వెంకటేశ్వర్లు, వీకే రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

'సాక్షి'పై దాడులను ఖండించాలి



సాక్షి పత్రికపై ఏపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు చేపట్టడం అత్యంత దారుణం. ప్రజాస్వామ్యంలో పత్రికలు ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉంటాయి. ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబిస్తుంటాయి. పాలకుల ప్రజావ్యతిరేక విధానాలను బయటపెడుతుంటాయి. ఇది సహించలేని ఏపీ ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను హరించడం, కాలరాయడం తీవ్రంగా ఖండిస్తున్నా. సాక్షి మీడియాపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలి. సాక్షి పత్రిక, ఎడిటర్, సిబ్బందిపై దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురిచేయడాన్ని ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు తీవ్రంగా ఖండించాలని కోరుతున్నా.

- తాటిపాముల వెంకట్రాములు, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు

ఏపీ ప్రభుత్వ వైఖరి సరికాదు..



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 'సాక్షి' మీడియాపై అక్కడి ప్రభుత్వ వైఖరి సరికాదు. ప్రభుత్వాలు పత్రికలపై తప్పుడు కేసులు పెట్టడం, బెదిరింపులకు పాల్పడితే జర్నలిస్టులు, ప్రజాసంఘాలు ఐకమత్యంతో ఎదుర్కొని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకుంటాం. 'సాక్షి' మీడియాతోపాటు ఎడిటర్ ధనంజయరెడ్డిపై పెట్టిన కేసులను వెంటనే బేషరతుగా ఎత్తివేయాలి.

- వేముల నాగరాజు, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు, గ్రేటర్ వరంగల్

ఏపీ ప్రభుత్వ చర్యలను ఖండిస్తున్నాం..



ప్రజల గొంతుకగా ఉన్న జర్నలిస్టులు, పత్రికలపై ప్రభుత్వాలు కేసులు పెట్టడం, దాడులు చేయడాన్ని ఖండిస్తున్నాం. సాక్షి మొదటి నుంచి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు ఎంతగానో కృషి చేస్తోంది. ప్రజలు, ప్రభుత్వాలకు వారధిగా ఉన్న పత్రికలపై కేసులు బనాయించడం రాజ్యాంగం కల్పించిన హక్కులను ఉల్లంఘించడమే.

- కడారి భోగేశ్వర్, టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి

కేసులు పెట్టడం హేయం..



ప్రభుత్వాలకు వ్యతిరేకంగా వార్తలు రాసినప్పుడు కేసులు పెట్టడం, బెదిరింపులకు పాల్పడడం హేయమైన చర్య. ముఖ్యంగా ఏపీలో 'సాక్షి' మీడియాపై వరుస దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. తక్షణమే కేసులు ఎత్తివేయాలి

- మైస శ్రీనివాస్, టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి

బంద్ ఫర్ జస్టిస్‌ను విజయవంతం చేద్దాం

వరంగల్ చౌరస్తా: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు శనివారం నిర్వహించనున్న బీసీ బంద్ ఫర్ జస్టిస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ పిలుపునిచ్చారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో రవికుమార్‌తో పాటు మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు, కుసుమ సతీష్, రత్నం సతీష్ షా మాట్లాడుతూ 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలుపై కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు, జిల్లా ఓబీసీ అధ్యక్షుడు కందిమల్ల మహేష్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఎర్రగొల్ల భరత్ వీర్, కరీమాబాద్ మండల అధ్యక్షుడు బోరిగం నాగరాజు పాల్గొన్నారు.

15 ఏళ్లలోపు పిల్లలకు ఉచిత వైద్యం

హన్మకొండ అర్బన్: బాణసంచా పేలుళ్లతో కళ్లకు గాయాలైతే 15 ఏళ్లలోపు పిల్లలకు ఉచిత కన్సల్టేషన్, శస్త్రచికిత్సలు చేయనున్నట్లు వాసన్ ఐకేర్-ఏఎస్జీ హాస్పిటల్ వైద్యులు సర్దార్‌ఖాన్ తెలిపారు. హనుమకొండ ఆస్పత్రిలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అక్టోబర్ 15వ తేదీ నుంచి 24 వరకు శస్త్రచికిత్సలు, వైద్యసేవలు అందిస్తామన్నారు. అత్యవసర సాయానికి 1800 571 3333 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో డాక్టర్లు రాజ్‌కుమార్, వెంకట్రాం నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వరంగల్ మార్కెట్‌కు సెలవులు



వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు ఈనెల 18వ తేదీ నుంచి 22వ తేదీ వరకు సెలువులు ఉన్నందున మార్కెట్‌లో ఎలాంటి క్రయవిక్రయాలు జరగవని ఈవిషయాన్ని రైతులు, వ్యాపారులు, గుమస్తా, దడవాయి, కార్మికులు గమనించాలని మార్కెట్ కమిటీ కార్యదర్శి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 18వ తేదీ (శనివారం)వారంతపు యార్డు బంద్, 19న (ఆదివారం)వారంతపు సెలవు, 20న(సోమవారం) దీపావళి పండుగ(ప్రభుత్వ సెలవు), 21న (మంగళవారం) అమావాస్య కావడంతో వరసగా మార్కెట్ బంద్ ఉంటుందని, బుధవారం 22వ తేదీన మార్కెట్ పునఃప్రారంభం అవుతుందని తెలిపారు. రైతులు తమ పంట ఉత్పత్తులను సెలవు దినాల్లో మార్కెట్‌కు తీసుకురావొద్దని సూచించారు.

కేయూ పరిధిలో నేటి పరీక్షలు వాయిదా

కేయూ క్యాంపస్: రాష్ట్రంలో బీసీ సంఘాలు బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో నేడు(శనివారం) కాకతీయ యూనివర్సిటీ పరిధిలో నిర్వహించాల్సిన వివిధ పరీక్షలను వాయిదా వేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య రాజేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వర్సిటీ పరిధిలో నిర్వహించాల్సిన ఎల్ఎల్‌బీ, బీటెక్, ఎంఎస్సీ ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, ఎంటెక్, దూరవిద్య ఎంఎల్ఐఎస్సీ పరీక్షలను వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు. మిగితా పరీక్షలు టైం టేబుల్ ప్రకారం జరుగుతాయని విద్యార్థులు గమనించాలని తెలిపారు. పూర్తి వివరాల కోసం www.kakatiya.ac.inలో చూడాలని కోరారు.

మణికంఠ కాలనీలో చోరీ

వరంగల్: వరంగల్ 14వ డివిజన్ ఏనుమాముల పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుందరయ్యనగర్ మణికంఠకాలనీలో శుక్రవారం మధ్యాహ్నం ఓ ఇంటిలో చోరీ జరిగిందని సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. సమాచారం తెలిసిన వెంటనే సీఐ సురేశ్, డాగ్ స్క్వాడ్‌తో వెళ్లి ఇంటిని పరిశీలించినట్లు తెలిసింది. ఈవిషయమై సీఐని వివరణ కోరగా బంగారం, నగదు దోచుకుపోయినట్లు నిర్ధారణ అయ్యిందని, ఇంటి యజమాని లేకపోవడంతో ఎంత పోయిందన్న వివరాలు తెలియలేదన్నారు. బాధితుడు రాత్రి 7 గంటల వరకు ఫిర్యాదు చేయలేదు. తాళం వేసిన ఇళ్లనే దొంగలు టార్గెట్‌గా పెట్టుకున్నందున ఎవరైనా ఊరికి వెళితే సమాచారం అందించాలని సీఐ కోరారు.



హర్డిల్స్‌లో పాల్గొన్న మహిళా క్రీడాకారులు



స్పీడ్ వాకింగ్ చేస్తున్న మహిళా క్రీడాకారులు



హైజంప్ చేస్తున్న క్రీడాకారిణి

రేస్‌వాక్‌లో రికార్డు బ్రేక్..

జేఎన్ఎస్‌లో రెండో రోజు అథ్లెట్ల సందడి

- 13 ఈవెంట్లలో పోటీలు పూర్తి

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో కొనసాగుతున్న జాతీయ స్థాయి 5వ అథ్లెటిక్స్ అండర్-23 చాంపియన్‌షిప్ పోటీల్లో అథ్లెట్లు శుక్రవారం అదే జోరు ప్రదర్శించారు. రెండో రోజు 30 ఈవెంట్లలో పోటీలు నిర్వహించగా 13 ఈవెంట్లలో ఫైనల్స్ పూర్తయ్యాయి. అథ్లెటిక్స్ పోటీల్లో 20వేల మీటర్ల పురుషుల రేస్‌వాక్‌లో ఆర్మీ విభాగానికి చెందిన సచిన్ బొహరా (1:26:59:83) నిమిషాలతో కొత్త రికార్డును సృష్టించాడు. 2022లో రాజస్తాన్‌కు చెందిన సంజయ్‌కుమార్ (1:27:14) నిమిషాల్లో చేరి విజేతగా నిలిచాడు. సరికొత్తగా ఆ రికార్డును బ్రేక్ చేయడం సంతోషంగా ఉందని సచిన్ తెలిపాడు. పోటీల ఏర్పాట్లను తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి, అధ్యక్షుడు స్టాన్ లీజోన్స్, డీవైఎస్ఓ గుగులోతు అశోక్‌కుమార్ పర్యవేక్షించారు. పోటీల నిర్వహణలో టెక్నికల్ అఫిషియల్స్, కోచ్‌లు వాసుదేవరావు, శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

పతకాలు సాధించిన క్రీడాకారులు..

మహిళల 20 వేల మీటర్ల రేస్‌వాక్‌లో మహిమాచౌదరి(రాజస్తాన్) గోల్డ్, ఆర్తి(హరియాణా) సిల్వర్, కోమల్‌పాల్(మధ్యప్రదేశ్) బ్రాంజ్ మెడల్ సాధించారు. **పురుషుల 20 వేల మీటర్ల రేస్‌వాక్:** సచిన్ బోహ్రా(ఆర్మీ)గోల్డ్, రోషన్‌కుమార్(ఝార్ఖండ్) సిల్వర్, హిమాన్షుకుమార్(ఉత్తరాఖండ్) బ్రాంజ్, **100 మీటర్ల హర్డిల్స్ మహిళల విభాగం:** ప్రంజాలి రాలిపాటి(మహారాష్ట్ర)గోల్డ్, అక్షిదాస్ (తమిళనాడు) సిల్వర్, శ్రీయారాజేష్(కర్ణాటక) బ్రాంజ్ మెడల్ కైవసం చేసుకున్నారు. **డెకాథ్లాన్ పురుషుల విభాగం:** కౌశల్‌కుమార్(మహారాష్ట్ర) గోల్డ్, అభిజిత్ భోసలే(ఎయిర్‌ఫోర్స్) సిల్వర్, హరీశ్ ఎస్(తమిళనాడు) బ్రాంజ్ గెలుపొందారు. **పురుషుల 1,500 మీటర్ల పరుగు:** ప్రభుజోత్‌సింగ్(పంజాబ్) గోల్డ్, వికాష్(హరియా ణా) సిల్వర్, ఆకాశ్‌భాటి(ఉత్తరప్రదేశ్) బ్రాంజ్ మెడల్ సాధించారు. **డిస్కస్‌త్రో పురుషుల విభాగం:** ఉజ్జ్వల్(జేఎస్‌డబ్ల్యూ) గోల్డ్, నాగేంద్రఅన్నప్ప(కర్ణాటక)సిల్వర్, రితిక్(ఎన్‌సీఓఈ(పటియాల)బ్రాంజ్ మెడల్ సాధించారు. **పురుషుల 400 మీటర్ల పరుగు :** తరణదీప్‌సింగ్(పోలీస్‌స్పోర్ట్స్ కంట్రోల్) గోల్డ్, సేతుమిశ్రా(బిహార్)సిల్వర్, అంకుల్, ఎన్‌సీఓఈ(త్రివేండ్రం), బ్రాంజ్ పతకాలు సాధించారు. **పోల్‌వాల్ట్ మహిళల విభాగం:** కార్తీక వి(తమిళనాడు) గోల్డ్, నేఖ ఎల్దో ఎన్‌సీఓఈ (త్రివేండ్రం) సిల్వర్, విదువిజయ్‌కుమార్(తమిళనాడు) బ్రాంజ్ మెడల్ సాధించారు. **110 మీటర్ల హర్డిల్స్ పురుషుల విభాగం:** క్రిషిక్ ఎం(ఐపీసీఎల్) గోల్డ్, రాహిల్‌సఖీర్(కేరళ) సిల్వర్, రతీష్‌దుహీషా(రిలయన్స్) బ్రాంజ్, **లాంగ్‌జంప్ పురుషుల విభాగం:** అనురాగ్ సీవీ(కేరళ)గోల్డ్, శారోన్‌దూస్(తమిళనాడు)సిల్వర్, ఆర్యన్‌చౌదరి (ఉత్తరప్రదేశ్) బ్రాంజ్, **హైజంప్ పురుషుల విభాగం:** శివ్‌భగవాన్(హరియాణా) గోల్డ్, సుదీప్(కర్ణాటక) సిల్వర్, ఎండీ అలీ(వెస్ట్‌బెంగాల్) బ్రాంజ్, **షాట్‌పుట్ పురుషుల**: అతుల్(రిలయన్స్) గోల్డ్, అనురాగ్‌సింగ్ (రైల్వే స్పోర్ట్స్) సిల్వర్, నిఖిలేశ్(హరియాణా) బ్రాంజ్, **400 మీటర్ల పరుగు మహిళల విభాగం:** ఆయుష్(ఉత్తరప్రదేశ్) గోల్డ్, ప్రియ(కర్ణాటక) సిల్వర్, సంద్రామోల్‌సాబు ఎన్‌సీఓఈ(త్రివేండ్రం)బ్రాంజ్ మెడల్ కైవసం చేసుకున్నారు.



పరుగు పందెం పోటీలో పాల్గొన్న క్రీడాకారులు



జావెలిన్ త్రో లో పాల్గొన్న క్రీడాకారుడు

ఏసీబీ వలలో అవినీతి చేపలు



ఏసీబీకి పట్టుబడిన ఫీల్డ్ ఆఫీసర్ హరీశ్, చిత్రంలో డీఎఫ్ఓ నాగమణి



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ డీఎస్పీ సాంబయ్య

- సొసైటీ సభ్యత్వం కోసం లంచం డిమాండ్
- రూ.80 వేలు తీసుకుంటూ పట్టుబడ్డ ఫీల్డ్ ఆఫీసర్
- వరంగల్ మత్స్యశాఖ ఆఫీసులో ఘటన

హన్మకొండ చౌరస్తా: హనుమకొండలోని ములుగు రోడ్ సమీపంలో గల వరంగల్ జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో అవినీతి చేపలను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. సమస్యల పరిష్కారం కోసం ఆఫీసుకు వచ్చిన మత్స్యకారుల్లో కలిసిపోయి అవినీతి చేపను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సినిమా సీన్‌ను తలపించే ఘటనతో మత్స్యశాఖ కార్యాలయ సిబ్బందికి అసలు ఏం జరుగుతుందో అర్థంకాక ఉక్కిరిబిక్కిరి అయ్యారు. అవినీతి నిరోధక శాఖ అధికారుల దాడులు మత్స్యశాఖ ఉద్యోగుల్లో ప్రకంపనలు లేపాయి. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా నర్సంపేట మండలం మాధన్నపేట గ్రామ మత్స్యసహకార సంఘంలో నూతన సభ్యులను చేర్చుకోవడం కోసం 2023లో అప్పుటి ఫిషరీస్ ఫీల్డ్ ఆఫీసర్, ప్రస్తుతం జిల్లా మత్స్యశాఖ అధికారి నాగమణికి సొసైటీ తరఫున దరఖాస్తు చేశారు. ఏడాది క్రితం సొసైటీ ప్రెసిడెంట్ తమ ఫైల్ అప్రూవల్ ఎప్పుడు అవుతుందని ఫీల్డ్ ఆఫీసర్ హరీశ్‌ను అడిగితే రూ.80 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఇదే విషయాన్ని డీఎఫ్ఓ నాగమణి దృష్టికి తీసుకెళ్లగా ఆమె సైతం హరీశ్ చెప్పిన మొత్తాన్ని ఇస్తేనే పని అవుతుందని చెప్పారు. రెండు సంవత్సరాలుగా మత్స్యశాఖ అధికారి చుట్టూ తిరిగిన మాధన్నపేట సొసైటీ ప్రెసిడెంట్, సభ్యులు విసిగిపోయారు. దీంతో హనుమకొండలోని ఏసీబీ అధికారులను ఆశ్రయించగా శుక్రవారం మత్స్యశాఖ కార్యాలయానికి వచ్చి.. ప్రణాళిక ప్రకారం ఫీల్డ్ ఆఫీసర్ హరీశ్‌కు సొసైటీ ప్రెసిడెంట్ రూ.50 వేలు, డైరెక్టర్ రూ.30 వేలు లంచం ఇస్తుండగా అక్కడే ఉన్న ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. హరీశ్‌ను విచారించగా తనకేమీ తెలియదని, జిల్లా మత్స్యశాఖ అధికారి నాగమణి తీసుకోమని చెబితేనే తీసుకున్నానని ఏసీబీ అధికారుల ముందు చెప్పాడు. దీంతో ఫీల్డ్ ఆఫీసర్ హరీష్, డీఎఫ్ఓ నాగమణి లను తదుపరి విచారణ కోసం నేడు(శనివారం) ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నట్లు డీఎస్పీ సాంబయ్య తెలిపారు.

బస్సు పోలీస్ స్టేషన్‌కు పోనివ్వండి

- సెల్‌ఫోన్ పోయిందని ప్రయాణికుడి హల్‌చల్
- సముదాయించి పంపించిన పోలీసులు

కురవి: 'నా ఫోన్ పోయింది.. బస్సును పోలీస్ స్టేషన్‌కు పోనివ్వండి..' అంటూ ఆర్టీసీ బస్సులో ఓ ప్రయాణికుడు హల్‌చల్ చేశాడు. వివరాలిలా ఉన్నాయి.. శుక్రవారం ఓ యువకుడు ఖమ్మం వెళ్లేందుకు మానుకోట డిపో ఆర్టీసీ బస్సు ఎక్కాడు. కాసేటికి అతని సెల్‌ఫోన్ పోయిందని బస్సులో వెతికాడు. ఫోన్ దొరక్కపోవడంతో కండక్టర్, డ్రైవర్‌తో ఫోన్ పోయిందని బస్సును పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లాలని వాదించాడు. డ్రైవర్ బస్సును పోలీస్ స్టేషన్ వద్దకు తీసుకెళ్లగా.. తన ఫోన్ పోయిందని.. చెక్ చేయాలని ప్రయాణికుడు పోలీసులను కోరాడు. చెక్ చేయడం కుదరదని, ఫిర్యాదు చేస్తే విచారణ చేస్తామని తెలిపారు. కానీ, ప్రయాణికుడు ఫిర్యాదు చేయకుండానే వెళ్లిపోయాడు.



ప్రయాణికుడితో మాట్లాడుతున్న కానిస్టేబుల్

రామప్ప కీర్తిని ప్రపంచానికి చాటిచెప్పాలి

- మాజీ డీజీపీ రతన్
- రామప్పలో ముగిసిన వరల్డ్ హెరిటేజ్ వలంటీర్ క్యాంప్

వెంకటాపురం(ఎం): కాకతీయులు నిర్మించిన రామప్ప దేవాలయానికి యునెస్కో గుర్తింపు రావడంతో ప్రపంచస్థాయిలో రామప్పకు ప్రత్యేక గుర్తింపు లభించిందని, రామప్ప కీర్తిని ప్రపంచానికి చాటి చెప్పాలని మాజీ డీజీపీ రతన్ వలంటీర్లకు పిలుపునిచ్చారు. రామప్పలో పది రోజులుగా జరుగుతున్న వరల్డ్ హెరిటేజ్ వలంటీర్ క్యాంపు శుక్రవారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ప్రొఫెసర్ పాండురంగారావు అధ్యక్షత వహించగా మాజీ డీజీపీ రతన్‌తోపాటు రాష్ట్ర ఆర్కియాలజికల్ అండ్ మ్యూజియం డైరెక్టర్ ప్రొఫెసర్ అర్జున్‌రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దేశంలోని 13 రాష్ట్రాల నుంచి 35 మంది, ఇరాన్ నుంచి ముగ్గురు వచ్చి శిక్షణ తీసుకోవడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలోని చారిత్రక ప్రదేశాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ తయారు చేస్తుందన్నారు. 13వ శతాబ్దంలో కాకతీయులు రామప్ప ఆలయాన్ని అద్భుతంగా నిర్మించడంతోనే ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిందన్నారు. అనంతరం కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ తరఫున వలంటీర్లకు సర్టిఫికెట్లు, మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో క్యాంపు కోఆర్డినేటర్ జనగాం శ్రీధర్‌రావు, అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ కుసుమ సూర్యకిరణ్, గైడ్‌లు గోరంట్ల విజయ్‌కుమార్, తాడబోయిన వెంకటేష్, యోగా గురువు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



ముగింపు సమావేశంలో పాల్గొన్న వలంటీర్లు

మినీ బ్యాంకులో రూ.59 వేలు గోల్‌మాల్

- వేలిముద్ర పెట్టించుకుని స్వాహా చేసిన ఎస్‌బీఐ మినీ బ్యాంక్ ఆర్గనైజర్
- లబోదిబోమంటున్న బాధితుడు

నర్సంపేట రూరల్: ఎస్‌బీఐ మినీ బ్యాంక్ (వినియోగదారుల సేవా కేంద్రం)లో డబ్బులు గోల్‌మాల్ అయిన ఘటన చెన్నారావుపేట మండలంలోని ఉప్పరపల్లిలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నారావుపేట మండలంలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన అడ్డగట్ల స్రవంతి.. గ్రామంలో పది సంవత్సరాలుగా ఎస్‌బీఐ మినీ బ్యాంక్‌ను నడిపిస్తున్నారు. ఇదే గ్రామానికి చెందిన ఆరెల్లి సాంబయ్య ప్రతి ఏడాది రూ.1,506 చొప్పున 21 సంవత్సరాలపాటు ఎల్ఐసీ ఇన్సూరెన్స్‌ను చెల్లించాడు. ఈ ఏడాది మార్చి 19వ తేదీన ఎల్ఐసీకి సంబంధించిన ఇన్సూరెన్స్ డబ్బులు రూ.59,581 తన అకౌంట్‌లో జమ అయ్యాయి. నగదు జమ అయ్యాయా.. లేదా.. లేదా అని తెలుసుకునేందుకు స్థానిక ఎస్‌బీఐ మినీ బ్యాంక్‌కు వెళ్లాడు. వెళ్లినప్పుడల్లా మినీ బ్యాంక్ నిర్వాహకురాలు స్రవంతి వేలిముద్ర వేయించుకొని చెక్ చేసినట్లుగా నటించి డబ్బులు పడలేదని చెప్పడంతో వెనుదిరిగాడు. ఎన్నిసార్లు చెక్ చేసినా ఫలితం లేకపోవడంతో బాధితుడు బ్యాంక్‌కు వెళ్లి మినీ స్టేట్‌మెంట్ తీసుకోవడంతో బండారం బయటపడింది. మార్చి 19వ తేదీన ఎల్ఐసీకి సంబంధించి రూ.59,581 జమ అయ్యాయని తేలింది. మార్చి 23వ తేదిన రూ. 29 వేలు, ఏప్రిల్ 4వ తేదీన రూ.30 వేలు మొత్తం రూ. 59 వేలు డ్రా చేసినట్లు ఉండడంతో లబోదిబోమంటూ వెళ్లి మినీబ్యాంక్ నిర్వాహకురాలిని నిలదీశాడు. అప్పుడే వేలిముద్ర వేసి డబ్బులు డ్రా చేసుకున్నావని నిర్వాహకురాలు చెప్పడంతో సాంబయ్య అవాక్కయ్యాడు. నా డబ్బులు నాకు ఇప్పించాలని కోరుతూ బాధితుడు మినీబ్యాంక్ ఎదుట కుటుంబ సభ్యులతో నిరసన వ్యక్తం చేశారు. దీంతో గ్రామస్తులు వచ్చి మినీ బ్యాంక్ నిర్వాహకురాలిని నిలదీయగా ఏం చేసుకుంటారో.. చేసుకోండి అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతుందని, తక్షణమే ఆమెపై చర్యలు తీసుకొని బాధితుడికి న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇదే విషయమై ఎస్సై రాజేశ్‌రెడ్డిని వివరణకోరగా.. బాధితుడి నుంచి ఫిర్యాదు అందిందని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు. మినీబ్యాంక్ నిర్వాహకురాలు స్రవంతిని వివరణ కోరగా ఆరెల్లి సాంబయ్యకు ఎల్ఐసీ ఇన్సూరెన్స్ డబ్బులు రాగానే రెండు దఫాలుగా వేలిముద్ర వేసి రూ.59 వేలు డ్రా చేసి ఇచ్చానని, నగదు ఇచ్చే క్రమంలో మా బుక్‌లో సంతకాలు సైతం చేయించానని, కావాలనే డబ్బులు ఇవ్వలేదని సాంబయ్య తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడని చెప్పడం కొసమెరుపు.



బ్యాంక్ స్టేట్‌మెంట్ చూపిస్తున్న బాధితుడు సాంబయ్య

బాణసంచా వ్యాపారంలో భద్రత పాటించాలి

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం : బాణసంచా విక్రయ సమయాల్లో భద్రతా ప్రమాణాలను పాటించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ విక్రయదారులకు సూచించారు. దీపావళి పండుగ సమీపిస్తున్న వేళ శుక్రవారం కమిషనరేట్ పరిధిలోని బాణాసంచా విక్రయదారులతో వరంగల్ పోలీస్ కమిషనర్ కమిషనరేట్ కార్యాలయములో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ సన్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ.. బాణాసంచా విక్రయాలు చేసేవారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని, అనుమతుల కోసం వ్యాపారస్తులు ముందుగా అగ్నిమాపక విభాగం అధికారుల నుంచి ఎన్‌ఓసీ పొందాలన్నారు. అలాగే వ్యాపారస్తులు స్థల యజమాని నుంచి అనుమతి పత్రాన్ని పొందాలన్నారు. రూ.800 ప్రభుత్వ బ్యాంక్ చలాన్ చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. విక్రయాలు జరిపే ప్రదేశంలో అగ్ని ప్రమాద నివారణకు వినియోగించే ఇసుక, నీరు, ఇతర అగ్ని ప్రమాద నిరోధక సాధనాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. గత అనుభవనాలను దృష్టిలో ఉంచుకొని వ్యాపారస్తులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా బాణాసంచా వ్యాపారం చేసే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే బాణాసంచా కాల్చే సమయంలో జాగ్రత్తలు పాటించాలని, పెద్దలు పిల్లల వద్ద ఉండాలన్నారు. సమావేశంలో డీసీపీలు షేక్ సలీమా, అంకిత్ కుమార్, రాజమహేంద్ర నాయక్, జిల్లా అగ్నిమాపక అధికారులు సుదర్శన్ రెడ్డి, రేమాండ్ బాబు, శ్రీధర్ రెడ్డి, అదనపు డీసీపీ రవి, ఏఎస్పీ శుభం, ఏసీపీ జితేందర్‌రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, నర్సింహారావులు, ఇన్‌స్పెక్టర్లు, వ్యాపారస్తులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్

వైద్యం వికటించి మహిళ మృతి

- అర్ధరాత్రి ఆస్పత్రి వద్ద ఉద్రిక్తత
- ప్రైవేట్ ఆస్పత్రి ఎదుట భారీగా పోలీసు బందోబస్తు



లక్ష్మి(ఫైల్)

పాలకుర్తి టౌన్: వైద్యం వికటించి మహిళ మృతి చెందిన సంఘటన గురువారం అర్ధరాత్రి జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని హరిత ప్రైవేట్ ఆస్పత్రిలో చోటు చేసుకుంది. బంధువులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవరుప్పుల మండల కేంద్రానికి చెందిన ఆలకుంట్ల లక్ష్మి(58) గర్భసంచిలో గడ్డ ఉండడంతో పాలకుర్తిలోని హరిత ఆస్పత్రిలో జాయిన్ అయింది. దీంతో వైద్యపరీక్షలు చేసిన డాక్టర్లు బుధవారం రాత్రి గర్భసంచి ఆపరేషన్ చేశారు. గురువారం రాత్రి లక్ష్మి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో డాక్టర్లు హనుమకొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. మార్గమధ్యలోనే లక్ష్మి మృతి చెందింది. దీంతో బంధువులు హరిత ఆస్పత్రి వద్దకు మృతదేహాన్ని తీసుకెళ్లారు. కాగా హరిత ఆస్పత్రి వద్ద సీఐ, నలుగురు ఎస్సైలతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసులు మృతురాలి బంధువులతో మాట్లాడి రూ.8 లక్షలు పరిహారం ఇచ్చేలా రాజీకుదిరిచినట్లు సమాచారం. ఈ విషయంపై ఎస్సై పవన్‌కుమార్‌ను వివరణ కోరగా మృతురాలి భర్త ఆలకుంట్ల ఉప్పలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనగామకు తరలించినట్లు తెలిపారు. లక్ష్మి మృతికి వైద్యుల కారణం కాదని, కేవలం గుండెనొప్పితో చనిపోయినట్లు భర్త ఉప్పలయ్య ఫిర్యాదు చేశాడని ఎస్సై తెలిపారు .

కూలీల ఆటో బోల్తా.. ఏడుగురికి గాయాలు

- గిరిపురం క్రాస్ వద్ద ఘటన



మరిపెడ రూరల్: ఎదురుగా వస్తున్న ట్రాలీ ఆటోను తప్పించబోయి కూలీల ఆటో బోల్తా పడింది. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం గిరిపురం క్రాస్ రోడ్డు వద్ద శుక్రవారం జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి మరిపెడ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లి గ్రామం నుంచి కూలీ పనుల నిమిత్తం 14 మంది ఆప్పే ఆటోలో సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలానికి మరిపెడ మండలం మీదుగా వెళ్తున్నారు. ఈ క్రమంలో గిరిపురం క్రాస్ రోడ్డు వద్ద మరిపెడ నుంచి గిరిపురం వైపు వస్తున్న ఓ ట్రాలీ ఆటో సడన్‌గా ఎదురు రావడంతో కూలీల ఆటో పల్టీ కొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న 14 మందిలో మంగమ్మ, మమత, అనసూర్య, మల్లయ్య, భిక్షమమ్మ, సుగుణమ్మతోపాటు మరొకరికి గాయాలు కాగా, ఇందులో ఒకరికి కాలు విరిగింది. దీంతో స్థానికులు గమనించి 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో చికిత్స నిమిత్తం క్షతగాత్రులను మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు.



108 అంబులెన్స్‌లో క్షతగాత్రులు

పరిమితికి మించి ప్రయాణం

ఏడుగురితో ప్రయాణించాల్సిన ఆటోలో పరిమితికి మించి 14 మందిని తరలించడంతో అదుపుతప్పి పల్టీ కొట్టినట్లు తెలుస్తుంది. ఇప్పటికైనా పోలీసులు స్పందించి అడ్డగోలుగా ప్రయాణికులకు ఎక్కించుకుంటున్న ఆటోలను అదుపు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి



హరిబాబు(ఫైల్)

ఐనవోలు: ప్రేమించిన యువతి తల్లిదండ్రులు మందలించారని మనస్తాపానికి గురైన యువకుడు పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రాంనగర్ గ్రామానికి చెందిన యాకర ప్రమీల- బాబుల చిన్న కుమారుడు యాకర హరిబాబు(27) డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల హరిబాబు ఓ యువతిని ప్రేమించాడు. విషయం తెలుసుకున్న సదరు యువతి తల్లిదండ్రులు హరిబాబును దూషించారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన హరిబాబు ఈ నెల 12న రాంనగర్‌లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు హరిబాబును ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతిచెందాడు. మృతుడి మేనమామ కలకోట రత్నం ఫిర్యాదు మేరకు యువకుడు ప్రేమించిన అమ్మాయి, వారి తల్లిదండ్రులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ వెల్లడించారు.

హైదరాబాద్-గోరఖ్‌పూర్ వీక్లీ రైళ్ల రద్దు

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్ మీదుగా ప్రయాణించే హైదరాబాద్-గోరఖ్‌పూర్-హైదరాబాద్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లను నవంబర్ 28వ తేదీ నుంచి 2026 సంవత్సరం జనవరి 2వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ శుక్రవారం తెలిపారు. నార్త్ సెంట్రల్ రైల్వేలోని ఝాన్సీ రైల్వే స్టేషన్‌లో రైల్వే ట్రాక్, ప్లాట్‌ఫాం పనులు చేపడుతున్న కారణంగా రైళ్లను రద్దు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

రైళ్ల రద్దు వివరాలు

2025 నవంబర్ 28వ తేదీ నుంచి 2026 జనవరి 2వ తేదీ వరకు హైదరాబాద్-గోరఖ్‌పూర్ (07075) వెళ్లే వీక్లీ ఎక్స్‌ప్రెస్, నవంబర్ 30వ తేదీ నుంచి 2026 జనవరి 4వ తేదీ వరకు గోరఖ్‌పూర్-హైదరాబాద్ (07076) వెళ్లే వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేస్తున్నట్లు సీపీఆర్వో తెలిపారు.

ఘనమైన కుటుంబ వ్యాపార నేపథ్యం ఉన్నంత మాత్రాన...
'విజయం అనివార్యం' అని చెప్పడానికి లేదు.
అంకితభావం, కష్టం ఉంటేనే విజయం సొంతం అవుతుంది.
ఘనమైన కుటుంబ వ్యాపారనేపథ్యం లేనంత మాత్రాన...
'విజయం దూరం' అని చెప్పడానికి లేదు.
ఆసక్తికి అంకితభావం, కష్టం తోడైతే విజయం సొంతం అవుతుంది.
దీనికి తాజా ఉదాహరణ... అవెండస్ వెల్త్-హురున్ ఇండియా-2025 జాబితా.
35 ఏళ్ల లోపు ప్రతిభావంతులైన 155 మంది యంగ్ ఎంటర్‌ప్రెన్యూర్‌లు వెల్త్-హురున్ ఇండియా జాబితాలో చోటు సాధించారు.
వీరిలో...
వారసత్వ బాధ్యతకు తమ శక్తియుక్తులను జోడించి తమదైన గుర్తింపు తెచ్చుకున్నవారు ఉన్నారు. కొన్ని ఉత్పత్తులలో లోపాలు కనిపెట్టి లోపాలు లేని, సౌకర్యవంతమైన ప్రాడక్ట్స్ కోసం ఎంటర్‌ప్రెన్యూర్‌లుగా మారి విజయం సాధించిన వారూ ఉన్నారు... వారిలో కొందరు యంగ్ ఫిమేల్ ఎంటర్‌ప్రెన్యూర్‌ల గురించి..

యువ హవా


అవంతిక సరాగి

దేశంలో తొలి బయోప్లాస్టిక్ ప్లాంట్

చెరకు, బయోప్లాస్టిక్‌కు సంబంధించిన ఆపరేషన్‌లలో యువ మార్గదర్శకురాలిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది అవంతిక సరాగి. కాలిఫోర్నియాలో చదువుకున్న అవంతిక తమ బల్‌రామ్‌పూర్ చినీ మిల్స్ లిమిటెడ్ (బీసిఎంఎల్)ను పీఎల్‌ఏ (పాలీలాక్టిక్ యాసిడ్) తయారీ సౌకర్యాన్ని అందించే కంపెనీగా తీర్చిదిద్దే ప్రయత్నాలలో ఉంది. ఇది మన దేశంలోని మొట్ట మొదటి బయోప్లాస్టిక్ ప్లాంట్ కానుంది.

పీఎల్‌ఏ అనేది చెరకు పునరుత్పాదక వనరుల నుండి తయారైన బయో ఆధారిత, కంపోస్టబుల్, తక్కువ ఉద్గారాల ప్లాస్టిక్. దీనిని సాధారణంగా ప్యాకేజింగ్, త్రీడి ప్రింటింగ్‌లో ఉపయోగిస్తారు.

మన దేశంలోని ఈ తొలి బయోప్లాస్టిక్ ప్లాంట్ వల్ల బీసిఎంఎల్ లాభాల బాటలో పయనించనుంది. టర్నోవర్ పెరగనుంది. పర్యావరణ అనుకూలంగా కూడా మారనుంది.

తరగతి గదిని మార్చేలా


పరిత పరేఖ్

వినూత్నమైన ఆలోచన విధానంతో విద్యా, సాంకేతిక రంగంలో మంచి గుర్తింపు తెచ్చుకున్న యంగెస్ట్ ఎంటర్‌ప్రెన్యూర్ పరిత పరేఖ్. బ్రౌన్ యూనివర్శిటీలో చదువుకుంది. బ్రౌన్ తరువాత స్టాన్‌ఫోర్డ్ యూనివర్శిటీలో 'ఎర్లీ చైల్డ్‌హుడ్ ఎడ్యుకేషన్'పై మాస్టర్స్ చేసింది. స్టాన్‌ఫోర్డ్‌లో చదువుకునే రోజుల్లో పిల్లల విద్యావిధానం మీద దృష్టి పెట్టేది. స్టాన్‌ఫోర్డ్‌లో చేసిన పరిశోధనలు, నేర్చుకున్న ఆధునిక సాంకేతిక విషయాలు ఆమెను ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ వైపు నడిపించాయి.

కట్టింగ్-ఎడ్జ్ ఎడ్యుకేషనల్ టెక్ ప్లాట్‌ఫామ్ 'టొడెల్'తో ఎంటర్‌ప్రెన్యూర్‌గా ప్రస్థానాన్ని ప్రారంభించింది పరిత. మూస బోధన పద్ధతులకు అతీతంగా ఆధునిక బోధన పద్ధతులు, ఆలోచనలతో 'టొడెల్' ప్లాట్‌ఫామ్‌కు రూపకల్పన చేసింది. 'టొడెల్' ప్రభావంతో చాలా బడులలో ఉపాధ్యాయుల బోధన పద్ధతి మారింది. ఒక్క ముక్కలో చెప్పాలంటే సంప్రదాయ, ఆధునిక విద్యాబోధనలో ఉన్న అంతరాన్ని తగ్గించడానికి 'టొడెల్' కృషి చేస్తోంది.

విద్యార్థులలో సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచనలను పెంపొందించే ప్రణాళికలతో 'టొడెల్' విద్యాప్రపంచంలో ప్రత్యేక స్థానాన్ని సాధించింది.

సక్సెస్‌ఫుల్ యూఎస్పీతో...


మినూ మార్గరెట్

ప్రారంభ కష్టాల మాట ఎలా ఉన్నా... ఉమెన్ యాక్టివేర్ 'బ్లిస్‌క్లబ్' మార్కెట్‌లో నిలుదొక్కుకోవడానికి ఎంతోకాలం పట్టలేదు. ఈ ఆన్‌లైన్ బ్రాండ్ ఆ తరువాత రెండు ఆఫ్‌లైన్ స్టోర్‌లను కూడా లాంచ్ చేసి విజయం సాధించింది. 'మార్కెట్‌లో ఎన్నో బ్రాండ్‌లు ఉన్నాయి కదా. మీ ప్రత్యేకత ఏమిటి?' అనే ప్రశ్న 'బ్లిస్‌క్లబ్' ఫౌండర్, సీయీవో మినూ మార్గరెట్ ముందు వచ్చి నిల్చుంది. సిగ్నేచర్ ఫ్యాబ్రిక్స్, వినూత్నమైన ప్రాడక్ట్ డిజైన్‌ను తమ కంపెనీ యూఎస్పీగా చేసుకొని విజయం సాధించింది మార్గరెట్.

నేషనల్ లెవెల్ ఫ్రిస్బీ ప్లేయర్ అయిన మినూ మార్గరెట్ యాక్టివేర్‌కు సంబంధించిన డీసెంట్ ఆప్షన్స్ గురించి ఆలోచిస్తున్నప్పుడు 'బ్లిస్‌క్లబ్' స్టార్టప్ ఆలోచనవచ్చింది.

'యాక్టివేర్ రంగంలోని కంపెనీలు డిజైన్ ఫస్ట్ విధానాన్ని అనుసరిస్తాయి. మేము మాత్రం ఈ విధానానికి దూరంగా ఉన్నాం. బ్లిస్‌క్లబ్‌కు డిజైన్ క్లబ్ లేదు. ప్రాడక్ట్ ఇంజినీరింగ్ టీమ్ మాత్రమే ఉంది. ఈ టీమ్ ఏర్పాటు చేయడానికి ప్రధాన కారణం యాక్టివేర్ సౌలభ్యానికి సంబంధించి మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలను కనుక్కోవడం. ఉదాహరణకు చెన్నైలోని ఒక మహిళ గురించి. వేడి వాతావరణంలో ఆమెకు లెగ్గింగ్స్ ధరించడం కష్టమయ్యేది. ఇలాంటి సమస్యను దృష్టిలో పెట్టుకొని వేడివాతావరణంలో కూడా సౌకర్యంగా ఉండే లెగ్గింగ్స్‌ను డిజైన్ చేశాం' అంటుంది మార్గరెట్.

చిన్న గదిలో మొదలై... కోట్ల టర్నోవర్ వరకు


నీతూ యాదవ్ – కీర్తి జాంగ్రా

బెంగళూరులోని చిన్న గదిలో మొదలైన 'యానిమల్' రూ.550 కోట్ల టర్నోవర్ ఉన్న కంపెనీ స్థాయికి చేరింది. ఐఐటీ-ఢిల్లీలో చదువుకున్న కీర్తి జాంగ్రా, నీతూ యాదవ్‌ల బ్రెయిన్ చైల్డ్ 'యానిమల్'. ఈ డిజిటల్ ప్లాట్‌ఫామ్ అవ్యవస్థీకృతంగా ఉన్న మన దేశంలోని పశువుల మార్కెట్‌పై ప్రత్యేక దృష్టి పెట్టింది.

పశువుల క్రయవిక్రయాలలో 'యానిమల్' యాప్ కీలక పాత్ర పోషిస్తోంది. తమ స్టార్టప్‌ను ప్రారంభించడానికి ముందు సర్వే నిర్వహించి రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు కీర్తి, నీతూ యాదవ్. డైరీ ఇండస్ట్రీలో కీలకమైన మార్పు తేవాలనుకున్న కీర్తి, నీతూ యాదవ్‌లు 'యానిమల్' యాప్‌తో తమ కలను నిజం చేసుకున్నారు. ఈ యాప్ ద్వారా మనం ఉన్న చోటు నుంచే వందల కిలోమీటర్‌ల దూరంలో పశువుల క్రయ విక్రయాలు జరుగుతున్న ప్రదేశం తదితర వివరాలు తెలుసుకోవచ్చు.



తియ్యటి వేడుక

వంటిల్లు

ముచ్చటగా అలంకరించిన లోగిళ్లు
అందంగా ముస్తాబైన చిన్నా పెద్దలు
ఓ వైపు దీప కాంతులు
మరోవైపు బాణాసంచా పేలుళ్లు
ఆనందాలు విప్పారుతుండగా
తియ్యని రుచులు నోరారా ఆస్వాదిస్తుంటే
వేడుకంతా నట్టింట్లో కొలువుదీరినట్టే ఉంటుంది.
రెట్టింపు ఆనందాలను పంచడానికి
వంటిల్లు తీపి వంటకాలను
సిద్ధం చేస్తూనే ఉంటుంది.
ఎక్కువ శ్రమ లేకుండా పండగవేళ
తియ్యని రుచులను సులువుగా చేసేద్దాం.
ఇంటిల్లిపాదికి ఆనందాన్ని పంచేద్దాం..



సూజీ హల్వా

కావలసినవి: సూజీ (బొంబాయి రవ్వ) – కప్పు; నీళ్లు – 2 కప్పులు; పంచదార – కప్పు; నెయ్యి – 3 టేబుల్ స్పూన్లు; యాలకుల పొడి – పావు టీ స్పూన్; జీడిపప్పు, కిస్‌మిస్ – అవసరమైనంత.

తయారీ: • పాన్‌లో నెయ్యి వేడి చేసి, జీడిపప్పు, ద్రాక్ష వేయించాలి. • వాటిని తీసి, అదే నెయ్యిలో సూజీ వేసి బంగారు రంగు వచ్చే వరకు వేయించాలి. • మరో పాత్రలో నీరు మరిగించి, రవ్వ పోస్తూ, కలపాలి. • రవ్వ ఉడికిన తర్వాత పంచదార కలిపి తర్వాత యాలకుల పొడి వేసి కలపాలి. • చివరగా వేయించిన కాజూ, ద్రాక్ష వేసి మిక్స్ చేయాలి.



గులాబ్ జామూన్

కావలసినవి: రెడీమేడ్ జామూన్ మిక్స్ – కప్పు; నీళ్లు/పాలు – అవసరమైనంత (జామూన్ మిక్స్ కలపడానికి); పంచదార – ఒకటింపావు కప్పులు; నీళ్లు – కప్పు; యాలకుల పొడి – చిటికెడు.

తయారీ: • పంచదార, నీళ్లు కలిపి, మరిగించి సిరప్ తయారు చేయాలి. దాంట్లో చిటికెడు యాలకుల పొడి కలపాలి • జామూన్ మిక్స్‌కి కొంచెం నీళ్లు లేదా పాలు జోడించి మృదువుగా కలపాలి • మిశ్రమాన్ని కొద్ది కొద్దిగా తీసుకుంటూ, ఉండలు చేయాలి • బాణలిలో నూనె పోసి వేడయ్యాక, సిద్ధంగా ఉంచుకున్న ఉండలు వేసి, వాటిని గోధుమ రంగు వచ్చే వరకు వేయించాలి • వేయించిన జామూన్లను వేడి సిరప్‌లో వేసి, రెండు గంటలు నాననివ్వాలి.



రైస్ పుడ్డింగ్ / పాయసం

కావలసినవి: బియ్యం – పావు కప్పు; పాలు – 3 కప్పులు; పంచదార – పావు కప్పు; యాలకుల పొడి – పావు టీ స్పూన్; యాలకులు, కిస్‌మిస్ – అవసరమైనంత; నెయ్యి – టేబుల్ స్పూన్.

తయారీ: • బియ్యం కడిగి, కొద్దిగా ఉడికాక పాలు పోసి, మెల్లిగా మరిగించాలి. • బియ్యం పూర్తిగా ఉడికాక పంచదార కలపాలి. • యాలకుల పొడి, వేయించిన జీడిపప్పు, కిస్‌మిస్ వేసి కలపాలి.



బేసిన్ లడ్డూ

కావలసినవి: బేసన్ (సెనగపిండి) – కప్పు; నెయ్యి – పావు కప్పు; పంచదార పొడి – పావు కప్పు; యాలకుల పొడి – పావు టీ స్పూన్.

తయారీ: • పాన్‌లో నెయ్యి వేసి, వేడి చేయాలి. మంట బాగా తగ్గించి, దాంట్లో శనగపిండి వేసి, మెల్లగా బంగారు రంగు వచ్చే వరకు వేయించాలి. • చల్లారిన తర్వాత పంచదార పొడి, యాలకుల పొడి వేసి కలపాలి. • మిశ్రమాన్ని కొద్ది కొద్దిగా తీసుకుంటూ, చేతులతో లడ్డూలు చేయాలి.

ధన త్రయోదశి

ఆరోగ్యమస్తు ధనప్రాప్తిరస్తు



నేడు ధనత్రయోదశి. సాధారణంగా ధన త్రయోదశి అనగానే బంగారం, వెండి, ఇతర గృహోపకరణాలు కొనడం అందరూ చేసేదే. అయితే ధనత్రయోదశి ప్రాశస్త్యాన్ని తెలుసుకోవడం ప్రతి ఒక్కరికీ అవసరం. ఆ కథ తెలుసుకుందాం.

దేవతలు, దానవులు అమృతం కోసం పాలసముద్రాన్ని చిలుకుతున్న సమయంలో ఆ క్షీరసాగరం నుంచి శ్రీ మహాలక్ష్మి జన్మించింది. అంతే కాదు సంపదలను ప్రసాదించే కల్పవృక్షం, కామధేనువు, దేవవైద్యుడు ధన్వంతరి కూడా శ్రీ మహాలక్ష్మితో పాటే జన్మించారు. ఆ రోజు ఆశ్వయుజ బహుళ త్రయోదశి. శ్రీమహాలక్ష్మి ..., ధనానికి ప్రతిరూపం. అందుకే., ఆమె జన్మదినమైన ఈ ఆశ్వయుజ కృష్ణ త్రయోదశిని.. 'ధన త్రయోదశి' అన్నారు.

ఎంత చదువు చదివినా.,, ఎన్ని తెలివితేటలు ఉన్నా., శ్రీ మహాలక్ష్మి అనుగ్రహం లేకపోతే జీవితం గడపడం కష్టం. అందుకే.. సర్వ సంపత్ప్రదాయిని అయిన శ్రీ మహాలక్ష్మి అనుగ్రహం కోసం సర్వ మానవాళి ఈ రోజున శ్రీమహాలక్ష్మిని ఎంతో భక్తి శ్రద్ధలతో పూజించి, ఆమె ఆశీస్సులు అందుకుంటారు.

ధనానికి అధిదేవత 'శ్రీమహాలక్ష్మి. ధనానికి అధినాయకుడు ఉత్తర దిక్పాలకుడైన 'కుబేరుడు'. అందుకే ఈ ధనత్రయోదశి నాడు శ్రీమహాలక్ష్మితోపాటు కుబేరుని కూడా ఆరాధిస్తారు. సాధారణంగా ఈ లక్ష్మీ పూజను సాయం సమయంలో ప్రదోష వేళలో చేసుకుంటే చాలా మంచిది.

లక్ష్మీ కుబేర వ్రతం

ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు, వ్యాపార అభివృద్ధి అదే విధంగా నూతన వ్యాపారం ప్రారంభించబోయే వారు, ఉద్యోగ అభివృద్ధి కోరుకుంటున్నవారు, అప్పుల బాధలు ఉన్నవారు లక్ష్మీ కుబేర వ్రతాన్ని చేసుకోవడం వల్ల ఆయా బాధల నుంచి విముక్తి పొంది, అన్నింటా అభివృద్ధి జరుగుతుందని పెద్దలు చెబుతారు కాబట్టి ఈ వ్రతాన్ని చేయాలనుకుంటున్న వారు అక్షయ తృతీయ రోజు, ధన త్రయోదశి రోజు, కార్తీక శుక్ల పంచమి రోజు లేదా తొమ్మిది గురువారాలు లేక శుక్రవారాలు చేసుకోవచ్చు.

ధన్వంతరి జయంతి

దేవవైద్యుడు, సాక్షాత్తూ శ్రీ మహావిష్ణువు అంశావతారమైన ధన్వంతరి పాలసముద్రం నుంచి ఆవిర్భవించింది కూడా ధనత్రయోదశి నాడే. అందుకే ఈ పర్వదినాన చాలామంది ధన్వంతరిని కూడా పూజిస్తారు. ముఖ్యంగా ఆరోగ్యం బాగలేని వారు, ఆయుర్వేద వైద్య విధానం మీద నమ్మకం ఉన్న వారు శ్రీమహావిష్ణువు ప్రతిరూపమైన ధన్వంతరిని పూజించడం వల్ల ఆరోగ్యవంతులవుతారని చెబుతారు. ధన్వంతరి చేతిలో శంఖు చక్రాలతోపాటు ఔషధ భాండం లేదా అమృత కలశం, జలగ ఉంటాయి. జలగ శరీరంలో చేరిన చెడు రక్తాన్ని పీల్చివేసి ఆరోగ్యాన్నిస్తుందని ప్రతీతి. అందుకే ధన్వంతరి చేతిలో జలూకం అంటే జలగ ఉంటుంది.

నేడు శని త్రయోదశి కూడా. ధనత్రయోదశి నాడే శని త్రయోదశి కూడా రావడం చాలా విశేషం. అందువల్ల ఈ వేళ పాత వస్తువులు, పాత ఆలోచనలు, పాతదనాన్ని వదిలించుకుని, కొత్త వస్తువులు కొనుగోలు చేయటం, కొత్త ఆలోచనలు చేయటం, కొత్త పనులకు శ్రీకారం చుట్టడం చాలా మంచిది.

పితృదేవతాపూజకు కూడా ధనత్రయోదశి చాలా ప్రశస్తమైనది. ధనత్రయోదశి నాడు ఇంటిలో దీపాలు వెలిగించి, మన పెద్దవారిని తలచుకోవడం వల్ల వారి ఆశీర్వాదంతో శుభం చేకూరుతుందని పండితులు చెబుతారు. ఈ శుభవేళ అందరికీ కీడు తొలగి మేలు చేకూరాలని కాంక్షిద్దాం.

– డి.వి.ఆర్.



వామ్మో.. ఏ(ఐ)డడుగులు..!

మన పురాతన తాటాకు శాసనాల గ్రంథాల్లో అన్నీ ఉన్నాయో లేవోగానీ... మన సినిమాల్లో మాత్రం సకల విజ్ఞాన శాస్త్రాలూ ఉన్నాయి. అందుకు నిదర్శనమే మనదైన పానిండియన్ సూపర్‌హిట్ బ్లాక్‌బస్టర్ సినిమా 'రోబో'!

ఏ అద్భుత ముహూర్తాన మన డైరెక్టర్ శంకర్ 'రోబో' తీశాడోగానీ... లోకమంతటా అవే వింతలు అచ్చం అలాగే జరుగుతున్నాయి. ఉదాహరణకు...

ఇక్కడి మన సినిమాలో హ్యూమనాయిడ్ రోబో కాస్తా మానవ మానస వికాసాలూ, వికారాలూ ఒంటబట్టించుకుని 'రోబో సేపియన్' అవుతాడా! అలా అవ్వగానే ఆ 'టాయ్'ఫ్రెండు కాస్తా హీరోయిన్‌కి 'బాయ్'ఫ్రెండుగా మారి... అచ్చం మన మానవ కుర్రాళ్లలాగే... తనను ప్రేమించని అమ్మాయి మీద యాసిడ్లూ గట్రా విసిరేంత క్రూరమైన 'సెల్ఫ్‌స్టైల్డ్ లవర్‌బా(టా)య్'గా మారిపోతాడు కదా.

అక్కడ అమెరికాలోని ఒహాయో రాష్ట్ర చట్టనిపుణులు బహుశా 'రోబో' సినిమా చూసి హడలిపోయి ఉంటారేమో... మానవ మేధకూ, కృత్రిమ మేధస్సుకూ మధ్య వివాహాలు వద్దంటే వద్దంటూ గొడవ గొడవ చేస్తున్నారు. అంతేనా... ఆ మేరకు ఓ చట్టం తీసుకువచ్చేందుకు బిల్లు కూడా ప్రిపేర్ చేశారు.

అదే డైరెక్టర్ శంకర్‌గారి ఆయొక్క అదే 'రోబో' సినిమాలో... "ఇనుములో ఓ హృదయం మొలిచెలే" పాటనుంచి స్ఫూర్తి పొందినట్టుగా... ఇప్పటికే మన పొరుగు దుండగీడైన చైనావాడు 'దివిరి ఇసుకన తైలంబు' రీతిగా దివిరి ఇనుమున గర్భసంచి నుంచి చిన్నారి పాపలను రేపీపాటికి తీసిస్తానంటూ తొడలుగొడుతూ, హడలగొడుతున్నారన్న సంగతి తెలిసిందే. అంతే కాదు... రోబోలకు సీమంతాలవీ గట్రా చేసేసి కృత్రిమ 'ఊంబ్'ల లోంచి ఉంగా ఉంగా పాపాయిలను పుట్టిస్తానంటూ సవాళ్లు విసురుతున్నారు కూడా.

అమిత వింతలకు నెలవైన అమెరికాలో... ఈ చిత్రవిచిత్రాలన్నీ చూస్తున్న ఒహాయో రాష్ట్రపు మేధావులు భయపడిపోతున్నారేమో... ఆ ఆందోళనతో స్తిమితంగా ఉండలేక... బహ్మాండమైన ఓ వివాహ నిషేధ చట్టాన్ని తెచ్చేందుకు నిశ్చయించుకున్నారు. ఆ మేరకు బిక్కు బిక్కుమంటూ బిల్లొకదాన్ని అక్కడి చట్టసభల్లో ప్రవేశపెట్టబోతున్నారు కూడా! దీనికి కారణమేంటంటే... అక్కడి కుర్రకారు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పెళ్లిళ్ల చేసుకునేందుకు తెగ ఉత్సాహపడిపోతున్నారట!

హాయ్యో...! ఇప్పటికే అతి మేధావులైన మానవులూ, అమితమైన మేధస్సుల 'కృత్రిమ మేధ' మధ్య పెళ్లిళ్లు జరిగితే... రేపు సదరు 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' కాస్తా పవరాఫ్ ఆటార్నీలంటూ పవర్‌పట్టా తీసుకోవడం, పార్టనర్‌తో చెట్టాపట్టాలే కాకుండా, లీగల్ వ్యవహారాల్లోకి దూరి, అసలు నిపుణులు తట్టాబుట్టా సర్దుకునేలా, చెట్టూపుట్టా పట్టుకుపోయేలా, బెదిరీ చెదిరీ పోయేలా చేస్తాయేమోనని హడలెత్తుతున్నారు 'ఒహాయో రాష్ట్ర'పు చట్ట నిపుణులు.

అందుకే... మనుషులకూ, యంత్రాలకు మధ్య పెళ్లి మంత్రాలు వద్దంటే వద్దంటూ పట్టుపడుతున్నారు. మానవులూ, యాంత్రాల మధ్య మనువులు వద్దంటూ వాదిస్తున్నారు. ఇది 'యంత్రమాత్రమూ' తగదంటూ బల్లగుద్ది మరీ శాసిస్తున్నారు మన ఒహాయో స్టేట్ రిప్రజెంటేటివూ, రిపబ్లికన్ మెంబరూ అయిన మిస్టర్ 'థాయిడస్ క్లాగెట్' గారు!

అలనాడెప్పుడో బ్రహ్మంగారు చెప్పిన వింతలన్నీ అక్కడా ఇక్కడా జరుగుతూనే ఉన్నాయి. ఇప్పుడీ నేపథ్యంలో ఈ పుట్టు తెలివితేటలున్న మన మానవాళీ... పెట్టు తెలివితేటలున్న రోబోయంత్రాళీ... కలగలసి సంకరమైతే... రేపు భవిష్యత్తులో సకల 'అతి'తెలివితేటలున్న బుజ్జిబుజ్జి రోబో-కంగాళీలకు ఆస్కారముంటుందేమోనని అనుమానిస్తున్నారు.

అచ్చం రోబో సినిమాలోలాగే... రేపెప్పుడైనా పొరబాటున ఆ 'చిట్టి' చిట్టి రోబోలకు విలనీయులైన ఏ అడ్డమైన సైంటిస్టులో 'రెడ్డు చిప్పు' పెడితే... అప్పుడది మన మానవాళి చేతికి 'డేంజరు చిప్పే'ననేమోనంటూ ఇన్నిరకాల ఆంక్షలూ, హాహాకారాలంటూ లోకంలోని ప్రజలంతా తెగ చెవులు కొరుక్కుంటున్నారన్నది అభిజ్ఞ వర్గాల అతి రహస్య భోగట్టా.

– యాసీన్

ఏఐ మ్యారేజ్ ప్రపోజల్

ప్రేమలేఖల నుంచి ఎస్‌ఎంఎస్‌ల వరకు లవ్, మ్యారేజ్ ప్రపోజల్స్ పలు రకాలు. తాజా విషయానికి వస్తే...ఒక కుర్రాడు ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ను ఉపయోగించి ఫేక్ డిస్నీ-స్టైల్ ట్రైలర్ ద్వారా తన స్నేహితురాలికి మ్యారేజ్ ప్రపోజ్ చేశాడు. ఈ వీడియోకు 11 మిలియన్‌ల వ్యూస్ వచ్చాయి.



ఈ వీడియోను ఎన్నో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో రీషేర్ చేస్తున్నారు. 'ది ఈజీయెస్ట్ యస్. యస్, ప్రపోజ్డ్ టు జె... యూజింగ్ ఏఐ' అని వీడియోకు కాప్షన్ ఇచ్చారు. వీడియో చివరలో 'విల్ యూ మ్యారీ మీ' అనే కామెంట్ కనిపిస్తుంది. ఇంతకీ ఆ అమ్మాయి 'యస్' చెప్పిందా? యస్! 'ది మోస్ట్ బ్యూటీఫుల్ మ్యారేజ్ ప్రపోజల్' అంటూ స్పందించారు నెటిజనులు.

బులియన్ (బంగారం 10 గ్రా.; వెండి కిలో) అక్టోబర్ 17న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,34,990	1,35,150	1,32,770	1,35,150	1,32,500	1,33,090
బంగారం (22 క్యారెట్లు)	1,24,590	1,21,700	1,21,700	1,25,350	1,21,900	1,22,000
వెండి	1,90,000	1,81,000	2,03,000	1,81,000	1,81,000	2,03,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.